ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల స్థావరంపై మెరుపు దాడి

కొత్తగూడెం క్రైం, జనవరి 16: చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య మంగళవారం ఎదురు కాల్పులు జరిగాయి. కాంకేర్ జిల్లా ఎస్పీ దివ్యాంగ్ పటేల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లాలో సరిహద్దుల్లో మావోయిస్టులు మారణాయుధాలు, విస్ఫోటక పరికరాలు తయారు చేస్తున్నారన్న సమాచారం పోలీస్ అధికారులకు అందింది. ఈ మేరకు భద్రతా దళాల రాకను గమనించిన మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. అప్రమత్తమైన జవాన్లు ఎదురు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు మావోయిస్టుల స్థావరాన్ని సీజ్ చేశారు. మావోయిస్టులకు సంబంధించి భారీ డంపుని స్వాధీనపరుచుకున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రక్తపు మడుగుల ఆధారంగా కొందరు మావోయిస్టులు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

రాత్రి 11 గంటలకల్లా మూసివేయాలి

భద్రాచలం, జనవరి 16: పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలను రాత్రి 11 గంటలకల్లా మూసివేయాలని పట్టణ ఎస్‌హెచ్‌వో నాగరాజ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన ప్రకటన చేవారు. అందులో ఇలా ఉంది. హోటళ్లు/రెస్టారెంట్ల యజమానులు రాత్రి 10.30 గంటల లోపే ఆర్డర్లు తీసుకోవాలి. 11 గంటలకల్లా కచ్చితంగా మూసివేయాలి. వైన్ షాపులను కూడా రాత్రి 10 గంటలకు మూసివేయాలి. స్పీకర్/మైక్ వినియోగానికి ఏఎస్పీ అనుమతి తీసుకోవాలి. లాడ్జీలో రూం కావాలని వచ్చే వారి నుంచి ఆధార్ జిరాక్స్ కాపీ తీసుకోవాలి. ఆధారం లేకుండా రూం ఇవ్వకూడదు.

రథయాత్ర రూట్ మ్యాప్ కరపత్రం ఆవిష్కరణ

పాల్వంచ, జనవరి 16: ఈ నెల 22న అయోధ్యలో జరిగే రామమందిర పునఃప్రతిష్ఠ సందర్భంగా ఈ 21న పాల్వంచలో జరిగే రథయాత్ర రూట్‌మ్యాప్ కరపత్రాలను పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. శ్రీరామసేతు సేవాదళ్ సభ్యులు మాట్లాడుతూ.. అల్లూరి సెంటర్ నుంచి రాజీవ్ గాంధీ మార్కెట్, బస్టాండు, జాతీయ రహదారి మీదుగా అయ్యప్ప స్వామి గుడి వరకు రథయాత్ర సాగుతుందని వివరించారు. పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటింటా వికసించిన కాంతులు

జిల్లావ్యాప్తంగా ఇంటింటా సంక్రాంతి కాంతులు వికసించాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రజలంతా ఆది, సోమ, మంగళవారాల్లో భోగి, మకర సంక్రాంతి, కనుమ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. విద్యా, ఉద్యోగం, ఉపాధి అవకాశాల కోసం దూరప్రాంతాలకు వెళ్లిన వారంతా పండుగ కోసం సొంతూళ్లకూ చేరుకోవడంలో ప్రతి ఇంటిలోనూ సందడి నెలకొంది. మహిళలు, యువతులు రాత్రి వేళలోనే తమ ఇళ్ల ముందు ముగ్గులు వేసి రంగులు అద్దారు. అలాగే, ఉదయం సమీప ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం ఇంటికి చేరుకొని పిండి వంటలు ఆరిగిస్తూ కబుర్లు చెప్పుకుంటూ గడిపారు. చిన్న పిల్లలు పతంగులతో ఆటలాడారు. అశ్వారావుపేట నియోజకవర్గ సమీపంలోని ఆంధ్రా ప్రాంతాల్లో కోడిపందేలు కొనసాగాయి.

టేకులపల్లి: ముగ్గుల పోటీ

టేకులపల్లి: తాడు ఆట ఆడుతున్న మహిళలు

అశ్వారావుపేట: కేక్ కట్ చేస్తున్న తిరుమలకుంట వాసులు

అశ్వారావుపేట రూరల్: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: ముగ్గు వేస్తున్న మహిళలు

రామవరం: ముగ్గు వేస్తున్న మహిళ

చుంచుపల్లి: పతంగులు ఎగురవేస్తున్న చిన్నారులు

కరకగూడెం: హరిదాసుతో చిన్నారులు

ముగిసిన క్రీడాపోటీలు

ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం, జనవరి 16: మండలంలోని కట్టంవారిగూడెంలో వారం రోజులుగా జరుగుతున్న మండల స్థాయి అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. ముగింపు వేడుకల్లో విజేత కట్టంవారిగూడెం జట్టుకు ట్రోఫీని, రూ.20వేలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రదానం చేశారు. రన్నరప్‌గా నిలిచిన ఎంఆర్‌పీఎస్ యూత్ అశ్వాపురం జట్టుకు రూ.15వేలు అందజేశారు.

అచ్యుతాపురంలో..

బహుమతి అందిస్తున్న నాయకులు

దుమ్ముగూడెం, జనవరి 16: మండలంలోని అచ్యుతాపురం గ్రామంలో సోయం నవీన్‌కుమార్ మెమోరియల్ మండల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. చీమలపాడు, అచ్యుతాపురం, పైడిగూడెం, దోచినపల్లి జట్లు.. వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. సర్పంచ్ కృష్ణవేణి, ఉప సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సెమీ ఫైనల్‌కు వైఎంసీ క్రికెట్ టోర్నీ

జట్టు విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

బూర్గంపహాడ్, జనవరి 16: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న వైఎంసీ క్రికెట్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు మంగళవారంతో ముగిశాయి. నాలుగు జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులు, నిర్వాహకులు అందించారు.

రక్తదాన శిబిరం

కొణిజర్ల, జనవరి16 : పెద్దగోపతిలో తలసేమియా వ్యాధితో బాదపడుతున్న పిల్లల కోసం పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు ఊటుకూరు రంజిత్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని పెద్దమునగాల సర్పంచ్ పరికపల్లి శ్రీను ప్రారంభించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **భద్రాచలం బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **శ్రీమతి సింహాద్రి స్మాతి**, W/o : **సింహాద్రి అశోక్‌కుమార్**, **వయస్సు** : 29సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : ఇ.నెం1-88, నెల్లిపాక గ్రామం, అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు, బూర్గంపహాడ్ సబ్ రిజిస్ట్రారు వారి పరిధిలోనిగల అశ్వాపురం మండల ప్రజాపరిషత్‌లోని నెల్లిపాక గ్రామపంచాయితీకి చెందిన నెల్లిపాక గ్రామ ఇంటి నెం.1-88, **డాక్యుమెంట్ నెం. 71/2019** ఖాళీ స్థలము విస్తీర్ణము : 236.91 చ॥గ॥ అందులోని నిర్మించిన RCC బిల్డింగ్ విస్తీర్ణము : 299.82 చ॥అ॥లు ACC కట్టుబడి విస్తీర్ణము : 305.02 చ॥అ॥ లు ACC L&B 41.34 చ॥అ॥లు గల స్థిరాస్తికి హద్దులు:**తూర్పు** : గ్రామపంచాయితీ రోడ్డు, **పడమర**: ఇతరుల యిల్లు, **ఉత్తరం**: ముత్యాల రామారావు, **దక్షిణము** :మల్లెం కృష్ణవేణి.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **భద్రాచలం బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **శ్రీమతి షేక్ కాశీంబీ**, W/o : **షేక్ జానిమియా**, **వయస్సు** : 48సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : లక్ష్మీపురం గ్రామం, బూర్గంపహాడ్ మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైనా ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు,ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల ప్రజాపరిషత్‌లోని బూర్గంపహాడ్ గ్రామపంచాయితీకి చెందిన బూర్గంపహాడ్ శివారు గౌతమిపురం ఇంటి నెం.8-158, **డాక్యుమెంట్ నెం. 159/2018**, ఖాళీ స్థలము విస్తీర్ణము :(74.8x33.8) =280.91 చ॥గ॥ అందులోని నిర్మించిన ACC రేకుల యిల్లు (36x25) = 900 చ॥అ॥, ACC లెట్రిన్ బాత్‌రూమ్ విస్తీర్ణము : (11x5.6)= 61.6 చ॥అ॥ గల ఇంటికి సరిహద్దులు :**తూర్పు** : దాసరి చందర్ రావు గారి ఇల్లు, **పడమర** : గ్రామపంచాయితీ రోడ్డు, **ఉత్తరం**: పాల్వంచ నుండి భద్రాచలం పోవు PWD రోడ్డు, **దక్షిణము** : మాలాద్రి రెడ్డి గారి ఇల్లు.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

కనువిందుగా గోదా, రంగనాథుల కల్యాణం

భద్రాచలం, జనవరి 16: ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కల్యాణ మండపంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం గోదా, రంగనాథుల కల్యాణోత్సవం మంగళవారం కనువిందుగా సాగింది. సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు అమరవాది నారాయణాచార్యులు, అమరవాది చెన్నకేశవాచార్యులు, గొట్టుపుళ్ల రాజగోపాలాచార్యులు నిర్వహించారు.

భద్రాచలం: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 16: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీగోదారంగనాథుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఆలయంలో శ్రీస్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధాన పురోహితుడు ప్రసాదాచార్యులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీగోదా రంగనాథుల స్వామి వారి కల్యాణం జరిపించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 16: మండల కేంద్రంలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కనుమ పర్వదినం మంగళవారం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, ధూపదీప నైవేద్యాలు నిర్వహించారు. పురోహితులు ప్రసాదాచార్యులు, సత్యనారాయణ శర్మ వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శ్రీనందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

రామయ్యకు నిత్య కల్యాణం

భద్రాచలం, జనవరి 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం నిత్య కల్యాణాన్ని అర్చకులు నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలను, శేష వస్త్రాలను అందజేశారు.

'భట్టి'ని కలిసిన కార్మిక నాయకులు

డిప్యూటీ సీఎం భట్టిని సన్మానిస్తున్న పూర్వ విద్యావలంటీర్లు

పాల్వంచ, జనవరి 16: టీఎస్ జెన్కోలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104 నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

అశ్వారావుపేట, జనవరి 16: వచ్చే విద్యా సంవత్సరంలో తమను రెన్యువల్ చేయాలని పూర్వ విద్యావలంటీర్లు కోరారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నేతృత్వంలో ఇక్కడి పూర్వ విద్యావలంటీర్లంతాకలిసి మధిర వెళ్లి అక్కడ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మంగళవారం కలిశారు. తమ సమస్యల వివరించి వినతిపత్రం అందించారు. శాలువాతో సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

టేకులపల్లి, జనవరి 16: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని లాక్యాతండాలో సోమవారం చోటు చేసుకున్నది. బోడు ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ అర్బన్ పరిధి యనమలకుదురుకు చెందిన ఇస్లావత్ మధునాయక్ సంక్రాంతి పండుగకు భార్య స్వరూప, ఇద్దరు కుమారులతో అత్తగారి ఊరు అయిన బోడు పంచాయతీ లాక్యతండా గ్రామానికి వచ్చారు. సోమవారం సాయంత్రం ప్రధాన రహదారి ప్రక్కన ఆడుకుంటున్నారు. ఇద్దరి కుమారుల్లో పెద్ద బాబు ఇస్లావత్ వారుష్(7) రోడ్డు దాటుతుండగా బోడు వైపు నుంచి టేకులపల్లి వైపు అతి వేగంగా వస్తున్న గూడ్స్ ట్రాలీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు కాగా కుటుంబసభ్యులు వెంటనే అంబులెన్స్‌లో కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. బాలుడి తండ్రి ఇస్లావత్ మధునాయక్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ పూన్నెం గోపాల్‌పై కేసు నమోదైంది. ఎస్సై రంజిత్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టేకులపల్లి, జనవరి 16: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సులానగర్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సులానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బోడ హరి(25) నవంబర్ 24న ముత్యాలంపాడు క్రాస్ రోడ్ కొత్త పెట్రోల్ బంక్ సమీపాన ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. నాటి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, బాబు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

దమ్మపేట రూరల్, జనవరి 16 : రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో గాయపడిన లారీ క్లీనర్ ఆళ్ల సాయి(27) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ నెల 12వ తేది రాత్రి అచ్యుతాపురం క్రాస్ రోడ్డు శివారులో సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొన్నది. ఈ ఘటనలో సత్తుపల్లి వైపు వెళ్తున్న లారీ క్లీనరు ఆళ్ల సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అశ్వారావుపేటలో చికిత్స అందించి ఖమ్మం తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా పరిస్థితి విషమించి ఈ నెల 15వ తేదీన మృతి చెందాడు. మృతుడి సోదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుస్తులు, దుప్పట్లు పంపిణీ

దుమ్ముగూడెం, జనవరి 16: మండలంలోని డి.కొత్తగూడెం, కె.దుమ్ముగూడెం, గంగోలు, మహాదేవపురం తదితర గ్రామాల్లోని నిరుపేద బడి పిల్లలకు దుస్తులను గ్రేస్ మినిస్ట్రీ బిషప్ ఎం.జాకోబ్ సమకూర్చారు. వీటిని మంగళవారం సర్పంచ్ సరియం రాజమ్మ పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ గుడ్ల రాంబాబు, గ్రేస్ మినిస్ట్రీ ప్రతినిధులు తుంపెల్లి యేసురాజు, కె.జాన్ విల్సన్, కాల ప్రసాద్, కాపుల జయరాజు, జీవన్‌బాబు పాల్గొన్నారు.

పర్ణశాల, జనవరి 16: మండలంలోని సుంకర కాలనీ, చింతకుప్ప, మహాదేవపురం పాఠశాలల్లోని పేద విద్యార్థులకు దుప్పట్లు, స్వెట్టర్లు, కాస్మొటిక్స్‌ను గ్రేస్ సర్వీస్ సొసైటీ సమకూర్చింది. వీటిని మంగళవాం చిన్నబండిరేవు ఉపసర్పంచ్ ఉమేష్ యాదవ్ పంపిణీ చేశారు. పాస్టర్ కుంజా నెహెమ్యా తదితరులు పాల్గొన్నారు.

మాయావతి జన్మదిన వేడుక

కొత్తగూడెం అర్బన్, జనవరి 16 : అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చిన ఏకైక నాయకురాలు బీఎస్‌పీ అధినేత్రి మాయవతి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రా కామేశ్ అన్నారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి మాట్లాడారు. నాయకులు గంధం మల్లికార్జున్, నిరంజన్, వీరు, రాజేందర్, రవిశంకర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి వినతి

కేంద్ర మంత్రికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పాల్వంచ,జనవరి16 : పాల్వంచలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ స్పాంజ్ ఐరన్ ఎన్ఎండీసీ కర్మాగారం తెరిపించేలా చర్యలు తీసుకోవాలని ఈశాన్య ప్రాంత అభివృద్ధి సహకార సహాయ కేంద్రమంత్రి బీఎల్ వర్మకి ఐఎన్‌టీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఆయన కొత్తగూడెం వచ్చిన సందర్భంగా కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బాలు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, జనవరి 16: ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని ప్రథమ స్థానంలో నిలపడమే ప్రధాని మోడీ లక్ష్యమని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సహాయ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. సీతారాంపురంలో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. స్టాండ్ అప్ పథకం ద్వారా లబ్ధిపొందిన విజయలక్ష్మి అనే మహిళ ప్రధాని నరేంద్ర మోడి పథకం వల్ల తన కలనెరవేరిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, బ్యాంకు అధికారులు కే.వి.రంగాకిరణ్, కె.శ్రీనివాస్ రామారావు, సిర్రా రాజబాబు, సింధుభావన, అనిల్, బాదావత్ కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి, జనవరి 16: ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రి బీ.ఎస్ వర్మను సన్మానించిన బేతంపూడి సొసైటీ సిబ్బంది మంగళవారం సన్మానించారు. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం స్టేజి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, సొసైటీ సెక్రటరీ ప్రేమచారి, సిబ్బంది కె.వెంకటేశ్వర్లు, బి.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం విద్యార్థికి గోల్డ్ మెడల్

కరకగూడెం, జనవరి 16: మండలంలోని పద్మాపురం పంచాయతీ మొగిలితోగు గ్రామానికి చెందిన చుంచు వంశీ.. ఖమ్మంలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన నేషనల్ మీట్ ఆర్చరీ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. అతడిని మంగళవారం మణుగూరులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన క్యాంప్ కార్యాలయంలో అభినందించారు.

బీఆర్‌టీయూ, మిత్రపక్షాలను ఆదరించాలి

సారపాక, జనవరి 16: ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్‌టీయూను, దాని మిత్రపక్షాలను కార్మికులు ఆదరించాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ కోరారు. బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఐడియల్ యూనియన్ ముఖ్య నాయకులతో మంగళవారం సమావేశమయ్యారు. సానికొమ్ము శంకర్‌రెడ్డి, ప్రవీణ్, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను నెరవేర్చాలి

కొత్తగూడెం అర్బన్, జనవరి 16 : విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి మల్లెల రామనాథం డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఈ నెల 21న రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు.

అసిస్టెంట్ పోస్టు మాస్టర్‌కు సన్మానం

కొత్తగూడెం అర్బన్, జనవరి 16: కొత్తగూడెం ప్రధాన పోస్ట్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ పోస్టు మాస్టర్ వాసంశెట్టి కిరణ్‌కుమార్‌ను సిబ్బంది మంగళవారం సన్మానించారు. మూడేళ్లుగా ఇక్కడ అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన.. బదిలీపై ములకలపల్లి పోస్టుమాస్టర్‌గా వెళ్తుండడంతో కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్‌లో వారు ఆయనను సన్మానించి విధి నిర్వహణలో ఆయన కృషిని ప్రశంసించారు.

బోర్‌వెల్ పనులు షురూ

బూర్గంపహాడ్, జనవరి 16: మండలంలోని మోరంపల్లిబంజర్ వైకుంఠదామం వద్ద బోర్ వెల్ ఏర్పాటు పనులను సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఉప సర్పంచ్ కైపు లక్ష్మినారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

అశ్వారావుపేట రూరల్, జనవరి 16: మండలంలోని నడిమిడిరెడ్డిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యురాలు నారం నాగలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, **HAJIRA AYESHA SIDDIKHA** (OLD NAME) R/O. H.NO.10-4-45/1, MADINA MASJID LANE, EX-SERVICEMEN COLONY, CHUNCHUPALLI, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM DIST, TELANGANA changed my name as **HAJIRA AYESHA SIDDIQUA**, (new name), W/o. MOHAMMAD ISMAIL KHAN. KMM

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

కావలెను

★మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323057

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616